సంపుటి :02 సంచిక :228 పేజీలు :04

వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

సోమవారం 10, నవంబర్ 2025



## కోటగుళ్లకు కార్తీక సోమవార శోభ

- గణపేశ్వరునికి నందీశ్వరునికి రుద్రాభిషేకం
- స్వామివారికి, భవాని మాతకు పట్టు వస్త్రాలు సమర్పించిన సీఐ దంపతులు

05

## రేపే జూబ్లీహిల్స్ పోరు

### ఉపఎన్నికకు 407 పోలింగ్ కేంద్రాలు

### బరిలో 58 మంది అభ్యర్థులు

- ప్రతి కేంద్రంలో 4 బ్యాలెట్ యూనిట్లు
- మొత్తం 4,01,365 మంది ఓటర్లు
- 226 సమస్యాత్మక కేంద్రాలు



02

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నికకు ఎన్నికల సంఘం సర్వం సిద్ధంగా చేసింది. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానున్నది. సాయంత్రం 5 గంటలకు ముగియనున్నది. నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉన్నారు.

–అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి


# దివి సీమలకు కాలంకన్న కవి!

## గుండెపోటుతో కన్నుమూసిన వాగ్గేయకారుడు అందెశ్రీ

మట్టి మనుషుల పాటై, ఉద్యమ స్ఫూర్తికి ఊపిరై, కోట్లాది గుండెల స్పందనగా మారిన గళం మూగబోయింది! 'జయ జయహే తెలంగాణ' అంటూ ఆత్మగౌరవ పతాకాన్ని ఎగరేసిన ప్రజా వాగ్గేయకారుడు అందెశ్రీ (64) అలియాస్ నంది ఎల్లయ్య కాలానికి కవిత్వం రాసి, గుండెపోటుతో కన్నుమూశారు. నిరక్షరాస్యుడైనా, తన అనుభవాన్నే విద్యగా మలిచి, తెలంగాణ పల్లె జీవితంలోని ఆర్తిని, ప్రగతి కాంక్షను అక్షరాలుగా మలిచిన ఆ లోక కవి మహాప్రస్థానానికి ఏగడంతో... సాహితీ లోకంలో అక్షర సూర్యుడొకరు అస్తమించినంతటి శోకం నెలకొంది.

సోమవారం తెల్లవారుజామున నిద్రిస్తుండగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆయనను గాంధీ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నిరక్షరాస్యుడై, అనుభవంతో అగ్రశ్రేణి కవిగా ఎదిగిన ఆ లోక కవి మహాప్రస్థానానికి ఏగడంతో తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక లోకంలో విషాద ఛాయలు అలుముకున్నాయి

02



| కవిత్వంతో ఉద్యమాన్ని రగిలించిన కంఠం మూగబోయింది ! | మహాప్రస్థానానికి ఏగిన తెలంగాణ ప్రజల లోక కవి | ఆయన స్వస్థలం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రేబర్తి | జయ జయహే తెలంగాణ రాష్ట్ర గీతంతో జగత్ప్రసిద్ధి |
|---|---|---|---|





## కారులో భారీ పేలుడు

- 8 మంది మృతి.. 24 మందికి గాయాలు
- ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో ఘటన
- దేశ రాజధానిలో హై అలర్ట్

దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట మెట్రో స్టేషన్ లోని పార్కింగ్ స్థలంలో సోమవారం సాయంత్రం కారులో భారీ పేలుడు జరిగింది. ఈ పేలుడులో 8 మంది మృతి చెందగా 24 మందికి గాయాలైనట్లు తెలిసింది. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పేలుడు దాటికి మృతదేహాలు ఛిద్రమైనట్లు తెలిసింది. గాయపడిన 24 మందిని ఎల్ఎన్ జేపీ ఆసుపత్రికి తరలించారు. పేలుడు ధాటికి పలు కార్లు, ద్విచక్ర వాహనాలు ధ్వంసం అయ్యాయి. నిలిపి ఉంచిన కారులో జరిగిన ఈ పేలుడు కలకలం సృష్టించింది. దేశ రాజధానిలో హై అలర్ట్ ప్రకటించారు. ఈ ఘటనతో దేశంలోని పలు నగరాల్లో పోలీసులు, ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. హైదరాబాదులో కూడా అధికారులు అలెర్ట్ అయ్యారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

- అక్షరదర్బార్, ఢిల్లీ

# సంచార ప్రాంతాల్లో వీధి కుక్కలు ఉండకుండా కార్యాచరణ

- నగర మేయర్ గుండు సుధారాణి
- యానిమల్ వెల్ఫేర్ బోర్డు నిబంధనలు పాటించాలని ఆదేశాలు




అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ నగరంలోని జన సంచార ప్రాంతాల్లో వీధి కుక్కలు ఉండకుండా సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా కార్యాచరణ (యాక్షన్ ప్లాన్) సిద్ధం చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో వీధి కుక్కల నియంత్రణపై ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు మేయర్ తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు నిబంధనలకు అనుగుణంగా నగరంలో జన సమూహ ప్రాంతాలైన పాఠశాలలు, రైల్వే, బస్ స్టేషన్లు, ఆసుపత్రులు, పార్కులు, ఆలయాలు తదితర ప్రాంతాల్లో వీధి కుక్కలు సంచరించకుండా తగు చర్యలు చేపట్టాలని ఇటీవల సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసిందని, 66 డివిజన్లలో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయడానికి ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ శానిటేషన్ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఎస్ఈ సత్యనారాయణ, సీఎంహెచ్ఓ డా రాజారెడ్డి, సీహెచ్ఓ రమేష్, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, ఎంహెచ్ఓ డా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహా రుద్ర యాగశాల పరిశీలన



అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని శ్రీ కుంకుమేశ్వర ఆలయంలో ఈనెల 17న జరుగు మహా రుద్ర యాగశాలను సోమవారం పరకాల ఆర్డీఓ డా.నారాయణ, పరకాల తహసీల్దార్ విజయలక్ష్మి , ట్రైనింగ్ కలెక్టర్, పరకాల మున్సిపల్ కమిషనర్ సుష్మ యాగశాలను పరిశీలించారు. కార్యక్రమంలో కుంకుమేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు, మహా రుద్ర యాగ సమితి అధ్యక్షులు ఎర్ర లక్ష్మణ్, కన్వీనర్ గందె రవి, కోశాధికారి తోట భద్రయ్య, పరకాల టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్,ప తదితరులు పాల్గొన్నారు.




# దివి సీమలకు కాలంకన్న కవి!

- గుండెపోటుతో కన్నుమూసిన వాగ్గేయకారుడు అందెశ్రీ
- కవిత్వంతో ఉద్యమాన్ని రగిలించిన కంఠం మూగబోయింది !
- మహాప్రస్థానానికి ఏగిన తెలంగాణ ప్రజల లోక కవి
- ఆయన స్వస్థలం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రేబర్తి
- జయ జయహే తెలంగాణ రాష్ట్ర గీతంతో జగత్ ప్రసిద్ధి

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి: ప్రజావాగ్గేయకారుడు, తెలంగాణ గీతరచయిత అందెశ్రీ (64) అలియాస్ నంది ఎల్లయ్య కన్నుమూశారు. సోమవారం తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తుండగా గుండెపోటుకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. అందెశ్రీ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయన భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులు ఆసుపత్రి నుంచి లాలాపేటలోని ఇంటికి తరలించారు. అనంతరం జీహెచ్ఎంసీ ఇండోర్ స్టేడియంలో అభిమానుల సందర్శనార్థం ఉంచారు. విషాదంపై సీఎం రేవంత్‌రెడ్డి, ప్రధాని మోదీ, మంత్రులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అందెశ్రీ 1961 జూలై 18న వరంగల్ జిల్లా (ప్రస్తుతం సిద్దిపేట జిల్లా) మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో జన్మించారు. ఆయన బాల్యం కష్టాల కడలిలో అనాథగా గడిచింది. ఆయనకు ఏ విధమైన సంప్రదాయ, అధికారిక విద్య లభించలేదు. ఆయన నిరక్షరాస్యుడైనప్పటికీ, తెలంగాణ పల్లె వాతావరణంలో, జానపద కళారూపాలతో మమేకమై అపారమైన అనుభవాన్ని, లోకజ్ఞానాన్ని సంపాదించారు. బాల్యంలో గొర్రెలు కాసే వృత్తిలో, ప్రకృతి ఒడిలో స్వతస్సిద్ధంగా పాటలు ఆశువుగా అల్లేవారు. తెలంగాణ పల్లె జీవితం, శ్రమ, కష్టాలు, పండుగల సంస్కృతి ఆయన కవిత్వానికి తొలి గురువులుగా నిలిచాయి. పల్లెటూరి జీవన విధానం, జానపద సాహిత్యం, పాటలు ఆయన కవిత్వానికి మూల స్తంభాలుగా మారాయి. ఎలాంటి సాహిత్య నేపథ్యం లేకపోయినా, తనలోని సహజసిద్ధమైన ప్రతిభతో, స్వయంకృషితో అగ్రశ్రేణి కవుల్లో ఒకరిగా ఎదిగారు. శృంగేరి మఠానికి చెందిన శంకర్ మహారాజ్ ఆయన పాటలు విని ప్రత్యేకంగా ప్రోత్సహించారు.


## - మలిదశ ఉద్యమ సారథి

మలిదశ తెలంగాణ ఉద్యమంలో కవిగా, సాంస్కృతిక సారథిగా అందెశ్రీ నిరుపమానమైన, మహోన్నతమైన పాత్ర పోషించారు. ఆయన పాటలు, కవిత్వం తెలంగాణ ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని, అంతర్గత చైతన్యాన్ని నింపాయి. తెలంగాణ ధూంధాం కార్యక్రమాలకు రూపకల్పన చేసి, రూపశిల్పిగా ఉండి ప్రజల్లో రాజకీయ అవగాహన కల్పించారు. ఆయన రచనలు తెలంగాణ ప్రజల సామ్యవాద ఆకాంక్షలకు ప్రతిబింబాలుగా నిలిచాయి. తెలుగు సినిమా రంగంలో రచయితగా వారి పాత్ర. “మాయమై పోతున్నాడమ్మా మనిషన్నవాడు” పాటను ‘ఎర్ర సముద్రం’ సినిమా కోసం రాశారు. ఈ పాట ఆంధ్రప్రదేశ్ లోని విశ్వవిద్యాలయాల తెలుగు సిలబస్ లో కూడా చేర్చబడింది. “పల్లె నీకు వందనములమ్మో” వంటి పాటలు తెలంగాణ పల్లెటూరి స్వచ్ఛతను, సహజత్వాన్ని కళ్లకు కట్టినట్టుగా ప్రదర్శిస్తాయి. ‘గంగ’, ‘బతుకమ్మ’, ‘బొమ్మల కొలువు’ వంటి అనేక సినిమాలకు పాటలు, సందర్భోచిత సంభాషణలు అందించి, తన సాహిత్య ప్రతిభను వెండితెరపై కూడా అద్భుతంగా చాటుకున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.



## - సినిమా రంగం, బిరుదులు..

2006లో ‘గంగ’ చిత్రానికి ఉత్తమ గేయ రచయితగా ప్రతిష్ఠాత్మక నంది పురస్కారం లభించింది. దాశరథి సాహితీ పురస్కారం, రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం, ‘లోకకవి’ బిరుదుతోపాటు అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ వారి గౌరవ డాక్టరేట్ వంటి అనేక జాతీయ, సాహితీ పురస్కారాలు అందుకున్నారు. అందెశ్రీ జీవితం, కవిత్వం- సాహిత్యానికి పాఠశాల విద్య అడ్డంకి కాదని, కేవలం అనుభవం, నిబద్ధత, ప్రజలపై నిస్వార్థమైన ప్రేమ ఉంటే సరికొత్త చరిత్రలు సృష్టించవచ్చని నిరూపించారు. ఆయన పాటలు తరతరాలకు తెలంగాణ సంస్కృతి, ఉద్యమ స్ఫూర్తిని అందిస్తూనే ఉంటాయి. ఆయన కేవలం కవి కాదు, తెలంగాణ ఆత్మగౌరవానికి శాశ్వత ప్రతీకగా నిలిచిన ప్రజాకవి అందెశ్రీ .



## - ఉద్యమ గొంతుక

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ఆ గొంతుక, ఆ కలం నుంచి వెలువడిన పాటలు జీవనాడిలా, ఊపిరిలా నిలిచాయి. “మాయమై పోతున్నాడమ్మా మనిషన్న వాడు” అనే పాట ఆధునిక సమాజంలో మానవీయ విలువలు, నైతిక ప్రమాణాలు ఎలా పతనమవుతున్నాయో, మనిషి కేవలం స్వార్థంతో ఎలా జీవిస్తున్నాడో లోతుగా విశ్లేషిస్తూ యావత్ ప్రజానీకాన్ని ఆత్మవిమర్శ చేసుకునేలా ఆలోచింపజేసింది. ఆ పాటలోని ఆర్తి, సందేశం ఆయన రచన ఎంత గొప్పదో చాటుతుంది. అనుక్షణం ప్రజల మధ్యనే జీవిస్తూ, తాను నడియాడిన నేలను విడిచి బ్రతకలేనంటూ తన తుది శ్వాస వరకు ఒక సామాన్య మానవుడిగానే జీవించి, తన సాహిత్యంతో కోట్ల ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నాడు ఆ అద్వితీయ వాగ్గేయకారుడు. ఆయన రచనలు చరిత్రపుటల్లో శాశ్వతంగా నిలబడతాయి. అందుకు నిలువెత్తు నిదర్శనం ఈ పాట “జయ జయహే తెలంగాణ” గీతం. ఈ గీతం తెలంగాణ రాష్ట్ర ప్రజల ఉద్యమ స్ఫూర్తికి, చరిత్రకు, సంస్కృతికి, గొప్పదనానికి సజీవ రూపంగా అద్దం పడుతుంది. దీని ప్రాధాన్యతను గుర్తించి, ఇది తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతంగా ప్రకటించబడింది.

# రేపే జూబ్లీహిల్స్ పోరు

- ఉప ఎన్నికకు 407 పోలింగ్ కేంద్రాలు
- బరిలో 58 మంది అభ్యర్థులు
- ప్రతి కేంద్రంలో 4 బ్యాలెట్ యూనిట్లు
- మొత్తం 4,01,365 మంది ఓటర్లు
- 226 సమస్యాత్మక కేంద్రాలు

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి : జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నికకు ఎన్నికల సంఘం సర్వం సిద్ధంగా చేసింది. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానున్నది. సాయంత్రం 5 గంటలకు ముగియనున్నది. నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 2,08,561 మంది, మహిళలు 1,92,779 మంది, ఇతరులు 25 మంది ఉన్నారు. వీరిలో 1,908 మంది దివ్యాంగ ఓటర్లు, 85 ఏళ్లు పైబడిన వారు 2,134 మంది, 18–19 ఏళ్ల మధ్య వయసున్న యువ ఓటర్లు 6,859 మంది ఉన్నారు. ఓటర్ల సౌకర్యార్థం 139 భవనాల్లో మొత్తం 407 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటయ్యాయి. శాంతిభద్రతల దృష్ట్యా, వీటిలో 226 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక క్రిటికల్ కేంద్రాలుగా గుర్తించి, భద్రత ఏర్పాటు చేశారు.

## - ఈసారి 4 బ్యాలెట్ యూనిట్లు

ఈ ఉపఎన్నిక బరిలో మొత్తం 58 మంది అభ్యర్థులు ఉండటంతో, సాంకేతికంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక కంట్రోల్ యూనిట్, ఒక వీవీప్యాట్ తో పాటు నాలుగు బ్యాలెట్ యూనిట్లను ఉపయోగిస్తున్నట్లు డీఈఓ తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం 561 కంట్రోల్ యూనిట్లు, 2,394 బ్యాలెట్ యూనిట్లు, 595 వీవీప్యాట్లను సిద్ధంగా ఉంచామన్నారు. ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తినా వెంటనే స్పందించేందుకు 40 మంది ఈసీఐఎల్ ఇంజనీర్లను అందుబాటులో ఉంచామన్నారు. మొత్తం 2,060 మంది పోలింగ్ సిబ్బంది విధుల్లో పాల్గొంటారని చెప్పారు.

## - పటిష్ట భద్రత, ఓటర్లకు సౌకర్యాలు

ప్రశాంత పోలింగ్ కోసం నగర పోలీసులతో పాటు, ఐటీ, ఎక్సైజ్, నార్కోటిక్స్ వంటి వివిధ విభాగాలతో కూడిన జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ నిరంతరం పనిచేస్తోంది. అన్ని 407 పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలతో పాటు, ఎన్నికల సంఘం నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా పర్యవేక్షించేందుకు వెబ్ కాస్టింగ్ ఏర్పాటైంది. ఓటర్ల సహాయార్థం ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద హెల్ప్ డెస్క్ లు, క్యూలైన్లను పర్యవేక్షించేందుకు ఎన్సీసీ వాలంటీర్లు, పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించే ముందు ఓటర్లు తమ మొబైల్ ఫోన్లను భద్రపరుచుకునేందుకు మొబైల్ డిపాజిట్ కౌంటర్లు అందుబాటులోకి వచ్చాయి.

## - వేతనంతో కూడిన సెలవు

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రం యూసుఫ్గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యాలయాలు, సంస్థలకు పోలింగ్ కు ముందు రోజు నవంబర్ 10 సోమవారం, పోలింగ్ రోజు నవంబర్ 11 మంగళవారం, కౌంటింగ్ రోజు నవంబర్ 14 శుక్రవారం వేతనంతో కూడిన సెలవు దినాలు ప్రకిటించినట్లు జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్ తెలిపారు. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా, ఆలోచించి వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీ ప్రారంభం

**- జేఎన్ఎస్ స్టేడియంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ జెండా ఊపి ర్యాలీకి శ్రీకారం**

అక్షరదర్బార్, హనుమకొండ: డీడీజీ (స్టేట్స్), జోనల్ రిక్రూటింగ్ ఆఫీస్ చెన్నె, డైరెక్టర్ రిక్రూటింగ్, ఏఆర్ఓ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ సోమవారం ఉదయం హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో (జేఎన్ఎస్) ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సుమారు ఉదయం 2:30 గంటలకు సైన్యాధికారుల సమక్షంలో ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమం అనంతరం ఆదిలాబాద్, వనపర్తి జిల్లాల అభ్యర్థులకు రన్నింగ్ పోటీలు నిర్వహించారు. ఈ రెండు జిల్లాల నుంచి 794 మంది రాత పరీక్షలో అర్హత సాధించగా, 624 మంది హాజరై హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో ఫిజికల్ ఫిట్నెస్, ఇతర పరీక్షల్లో పాల్గొన్నారు. సైన్యాధికారులు తెలిపిన వివరాల ప్రకారం, తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాల అభ్యర్థులు ఇప్పటికే రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, నవంబర్ 10 నుంచి 22 వరకు ఫిజికల్, ఫిట్నెస్, మెడికల్ పరీక్షలను హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో ఎదుర్కోనున్నారు. ఈ కార్యక్రమానికి సైన్యాధికారులు, జిల్లా యువజన, క్రీడా అధికారి అశోక్ కుమార్ గుగులోతు, ఇతర గణ్యులు హాజరయ్యారు

# బీసీ ఆక్రోశ సభ విజయవంతం చేయాలి



అక్షర దర్బార్, పరకాల: రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడాన్ని ఖండిస్తూ ఈ నెల 15న కామారెడ్డి జిల్లాలో జరగనున్న బీసీ ఆక్రోశ సభను విజయవంతం చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ పరకాల మండల కోఆర్డినేటర్ చుక్క రత్నాకర్ పిలుపునిచ్చారు. పరకాల అమరదామంలో మండల అధ్యక్షుడు బొచ్చు నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆక్రోశ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ల హామీని అమలు చేయకపోవడం మోసమని విమర్శించారు. సభకు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బొచ్చు హరీష్, కృష్ణ మహారాజ్, తిరుపతి, దిలీప్, బాలు తదితరులు పాల్గొన్నారు.



# అస్తమించిన తెలంగాణ సాహితీ శిఖరం

## అందెశ్రీకి నివాళులులర్పించిన అంబటి శ్రీనివాస్

అక్షర దర్బార్, నర్సంపేట: తెలంగాణ జాతీయ గీత రచయిత, సాహితీ శిఖరం డాక్టర్ అందెశ్రీ మరణం రాష్ట్రానికి తీరని లోటని తెలంగాణ జన సమితి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి శ్రీనివాస్ అన్నారు. సోమవారం నర్సంపేటలో వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాప సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబటి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు షేక్ జావిద్‌లతో కలిసి అందెశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత మాట్లాడుతూ, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో తన మాట, పాటలతో అందెశ్రీ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన రచించిన జయ జయ హే తెలంగాణ గీతం రాష్ట్ర గీతంగా ఎంపిక కావడం ఆయన ప్రతిభకు నిదర్శనమని తెలిపారు. కవులు, గాయకులు, సాహితీ ప్రేమికులు అందెశ్రీ ఆకస్మిక మరణంతో దిగ్భ్రాంతికి గురయ్యారని, ఆయన కుటుంబానికి పార్టీ తరఫున ప్రగాఢ



సానుభూతి తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గుంటి రామచందర్, బోనగాని రవీందర్, సోల్తి సాయికుమార్, మహమ్మద్ సందాని తదితరులు పాల్గొన్నారు.

## అందెశ్రీ మరణం కళారంగానికి తీరని లోటు : నెల్లుట్ల సుమన్

అక్షర దర్బార్, దుగ్గొండి: తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, ప్రజా వాగ్గేయకారుడు డాక్టర్ అందెశ్రీ మరణం కళారంగానికి తీరని లోటని తెలంగాణ



సాంస్కృతిక సారథి టీం లీడర్ నెల్లుట్ల సుమన్ తెలిపారు. సోమవారం నర్సంపేటలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అందెశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి ఆయనకు ఘన నివాళులర్పించారు. కవి అందెశ్రీ ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షిస్తూ కళాకారులంతా కన్నీటి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కళాకారులు తాళ్ల సునీల్, యోచన, గాదెపాక బాబు, పడిదం రాజేందర్, బరిగేల్ రవీందర్, మేఘం, పవన్ భాస్కర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**- టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు బూరుగు రవి**

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్ : ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు బూరుగు రవి కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం భూపాలపల్లి టీఎన్జీవోస్ భవన్‌లో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023 నుండి పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని వెంటనే అమలు చేయాలి అని కోరారు. అలాగే సరెండర్ లీవ్ శాలరీ, మెడికల్ బిల్స్, జీపీఎఫ్, పంచాయతీ కార్యదర్శుల బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలి అని తీర్మానంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దశరథరామరావు, కేంద్ర సంఘం కార్యదర్శి జ్యానేశ్వర్ సింగ్, సురేందర్ రెడ్డి, అన్వార్, మురళీధర్ రెడ్డి, భార్గవ్, శ్రీదేవి, మాళవిక, సంబశివారావు, రమణకుమార్, రఘు తదితరులు పాల్గొన్నారు.



## వీసీకే పార్టీ యూత్ వింగ్ ఉమ్మడి జిల్లా ఇన్ చార్జిగా మహేష్

అక్షర దర్బార్, చిట్యాల: భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలానికి చెందిన శనిగరపు మహేష్‌ను విసికే పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లాల యూత్ వింగ్ ఇన్‌చార్జిగా నియమించారు. ఈ విషయాన్ని పార్టీ రాష్ట్ర యూత్ అధ్యక్షులు అంబాల అనిల్ తెలిపారు. విద్యారంగం, యువత సమస్యలపై చైతన్యంతో పనిచేసే నాయకుడిగా మహేష్ వ్యవహరించారని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాల్లో పార్టీ యూత్ విభాగాన్ని బలోపేతం చేయాలని, యువత సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిలకర శ్రీనివాస్, అంబాల అనిల్ మరియు జిల్లా నాయకులకు మహేష్ కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణ గొప్ప కవిని కోల్పోయింది

**- గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ డా. వేములపల్లి సుబ్బారావు**

అక్షర దర్బార్, నర్సంపేట రూరల్: తెలంగాణ రాష్ట్ర గేయ రచయిత, ప్రముఖ కవి డా. అందెశ్రీ మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటని గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ డా. వేములపల్లి సుబ్బారావు తెలిపారు. సోమవారం నర్సంపేటలోని గీతాంజలి విద్యాసంస్థల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "కదిలే కవిగానం మూగబోయింది... అక్షరాలు నిప్పుకణికలై, వెన్నెల పిల్లలై ఆడే రథం ఆగిపోయింది," అని బాధ వ్యక్తం చేశారు. జయ జయహే తెలంగాణ గీతం తెలంగాణ ప్రజల ఊపిరిగా



మారిందని, ఆయన సేవలు తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని పేర్కొన్నారు. తరువాత ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒక నిమిషం మౌనం పాటించి కన్నీటి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ రాజేష్, రాహుల్, ప్రవీణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కొండాయిలో ఫీవర్ సర్వే

అక్షర దర్బార్, ములుగు ప్రతినిధి : కొండాయి వైద్యాధికారి డా. హెచ్. ప్రణీత్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలో హౌస్ టు హౌస్ ఫీవర్ సర్వే నిర్వహించారు. ఇంటి ఇంటికీ వెళ్లి జ్వరం లక్షణాలు పరిశీలించగా ముగ్గురికి స్వల్ప జ్వరం ఉండగా, వారికి తగిన మందులు అందించారు. ప్రజలకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీటిని మరిగించి తాగాలని వైద్యాధికారులు



సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కె. భాస్కర్ రావు, ఆశా కార్యకర్త లక్ష్మి పాల్గొన్నారు.




# బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరికలు

**కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే దొంతి**

అక్షర దర్బార్, నల్లబెల్లి : బొల్లోనిపల్లి బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు బోయిని రాముతో పాటు 15 కుటుంబాలు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ లోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో రుద్రారపు రవి, బొల్ల బిక్షపతి, బండి ప్రభాకర్, మాదాసు విజేందర్, మాడగొని రాజు, ఎండి మాజీద్, సిద్ధ శ్రీనివాస్, పోలుదాసరి చిన్న రమేష్, ఆకుల రాజమౌళి, భూసాని ధర్మదేవ్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సిద్ధ సంతోష్, సీనియర్ నాయకులు పోలుదాసరి రంగన్న, మాజీ సర్పంచ్ తిప్పని లింగమూర్తి, రైతు సొసైటీ చైర్మన్ పోలుదాసరి శ్రీనివాస్, ఉపసర్పంచ్ మొతుకురి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ పాలనపై అవగాహన పెంపొందించుకోవాలి

**: కలెక్టర్ రాహుల్ శర్మ**

అక్షర దర్బార్, భూపాలపల్లి : గ్రామ స్థాయి పరిపాలనా విధానాలు, ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. సోమవారం ఐడీఓసి కార్యాలయంలో సివిల్ సర్వీసెస్ శిక్షణాధికారులు, విద్యా, వైద్య, వ్యవసాయ, మహిళా, శిశు సంక్షేమ, వయోవృద్ధుల సంక్షేమ, డీఆర్డీఓ, ప్రణాళిక శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల వాస్తవ పరిస్థితులపై ప్రత్యక్ష అనుభవం అవసరమని, ఫీల్డ్ స్థాయిలో ప్రజలతో నేరుగా ఇంటరాక్షన్ జరగాలని సూచించారు. సేవలు, సంక్షేమ పథకాల అమలు, సమస్యల గుర్తింపు, తక్షణ పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. పలిమెల, మహాముత్తారం మండలాలు నీతి ఆయోగ్ యాస్పిరేషన్ బ్లాకులుగా గుర్తించబడ్డాయని, ఐదు రంగాల్లో 49 సూచీలు, 81 ప్రమాణాలు నిర్దేశించబడ్డాయని వివరించారు. మొత్తం 12 మంది అధికారులు రెండు బృందాలుగా పలిమెల, మహాముత్తారం మండలాల్లో పర్యటించనున్నారని, షెడ్యూల్ ప్రకారం ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. పర్యటనలో ప్రజల అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకుని తగిన సూచనలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సివిల్ సర్వీసెస్ అధికారులు, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డా. మధుసూదన్, డీఈఓ రాజేందర్, వ్యవసాయ అధికారి బాబూరావు, డీఆర్డీవో బాలకృష్ణ, సీపీఓ బాబూరావు, సంక్షేమ అధికారి మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



# నాగరాజ్ పల్లిలో ఐకేపీ సెంటర్ ప్రారంభం

అక్షర దర్బార్, నల్లబెల్లి: నల్లబెల్లి మండలం నాగరాజ్‌పల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం (ఐకేపీ సెంటర్) ను నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ, ఏడీఏ, నల్లబెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిట్యాల తిరుపతిరెడ్డి, ఎమ్మార్వో కృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్, వ్యవసాయ అధికారి ఏపీఎం, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి మాలోత్ రమేష్, నర్సంపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి కిరణ్, నల్లబెల్లి మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, మాజీ ప్రధాన కార్యదర్శి చార్ల శివారెడ్డి, మండల కార్యదర్శి జిల్లా మునీందర్, నాయకులు చిట్యాల ఉపేందర్ రెడ్డి, వంగర వెంకన్న, అజ్మీర తిరుపతి, వడ్లూరి రమేష్, పోగుల కుమారస్వామి, ఒళ్ళే పైడి, గుటుకుల రాజకుమార్, కాసం మధు, నల్లగొండ సుధాకర్, సిద్ధ స్వామి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మృతులకు నివాళి

అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండలం వెంకట్రావుపల్లి (C) గ్రామానికి చెందిన నద్దునూరి రాజు తండ్రి భద్రయ్య, తల్లి ప్రమీల, అమ్మమ్మ బంగారి రాజమ్మ వార్షికోత్సవ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నివాళి కార్యక్రమం నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి మృతుల కుటుంబ సభ్యులకు సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య, జిల్లా ప్రచార కార్యదర్శి గుర్రపు రాజేందర్, మండల అధ్యక్షుడు



జెన్నే యుగంధర్, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద రమేష్, గండి రవి, DSU జిల్లా కో-కన్వీనర్ దూడపాక శ్రీకృష్ణ, పుల్ల అశోక్, బొజ్జపెల్లి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# 15న లోక్ అదాలత్

అక్షర దర్బార్, మొగుళ్ళపల్లి: ఈనెల 15న భూపాలపల్లి జిల్లా కోర్ట్ లో నేషనల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మొగుళ్ళపల్లి ఎస్సై బొరగాల అశోక్ తెలిపారు, మొగుళ్ళ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కేస్ లకు సంబంధించిన వ్యక్తులు ఈ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు వివాదములు, మనోవర్తి, విడాకులు, అత్తింటివారి ఆరళ్లు పిల్లల మనోవర్తి, అన్ని రకాల సివిల్ కేసులు, భూవివాదాలు, చట్టరీత్యా రాజీకి అర్హమైన అన్ని రకాల క్రిమినల్ కేసులు మరియు చెక్కు బౌన్స్ మొదలయిన కేసులలో సత్వర పరిష్కారాలను పొందవచ్చుని ఎస్సై బి అశోక్ తెలిపారు

## ఘనంగా ఆరె కుల

# కార్తీకవనభోజనోత్సవం..



- కార్తీక మాస వనభోజనాలు ఐక్యతకు ప్రతీక
- రైతు రుణ విమోచన మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు

అక్షర దర్బార్, పరకాల: పరకాల–నడికూడ మండల ఆరె బంధువుల ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజనోత్సవం మల్లక్కపేటలోని ఘనంగా జరిగింది. మండల అధ్యక్షులు ఎడ్డే రమేష్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధ్యక్షులు చెట్టుపెల్లి శివాజీ, రాష్ట్ర కన్వీనర్ జెండా రాజేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆరె సమాజం ఐక్యంగా ఉంటే అభివృద్ధి సులభమని, యువత సంఘ సేవలో భాగస్వాములు కావాలని, కార్తీక మాస వనభోజనాలు ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు హింగే శివాజీ, జిల్లా అధ్యక్షులు కొల్లూరు కందెరావు, ముఖ్య సలహాదారులు శ్రీ పేర్వాల లింగమూర్తి, నాగూర్ల సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు నాగూర్ల రాజేశ్వర్ రావు, వరికెల కిషన్ రావు, మండల అధ్యక్షులు లోకటి నాగేష్, ప్రధాన కార్యదర్శి అడగాని జనార్ధన్, పట్టణ అధ్యక్షులు నాగూర్ల శ్రీనివాస్, మహిళా నాయకురాలు హిరాబాయి తదితరులు పాల్గొన్నారు.




# చలో ఢిల్లీ విజయవంతం చేయాలి

**MRPS మండల అధ్యక్షుడు పరికి రత్నం**

అక్షర దర్బార్, నల్లబెల్లి: దళితులపై దాడులను అరికట్టడం, రాజ్యాంగ రక్షణ కోసం నవంబర్ 17న జరగనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ పిలుపునిచ్చారని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పరికి రత్నం తెలిపారు. నల్లబెల్లి మండల కేంద్రంలో నాయకులతో సమావేశం నిర్వహించిన ఆయన, తెలంగాణ గీత రచయిత అందెశ్రీ చిత్రపటానికి మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో



ఎమ్మార్పీఎస్ నాయకులు పరికి కోర్నెల్, మనుగొండ ప్రసాద్, జన్ను జయరావు, నాగెల్లి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ ఆక్రోశ సభను విజయవంతం చేయాలి

**-చింతల రమేష్ ముదిరాజ్**

అక్షర దర్బార్, చిట్యాల: కామారెడ్డి జిల్లాలో ఈనెల 15న జరిగే బీసీ ఆక్రోశ సభను విజయవంతం చేయాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి చింతల రమేష్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలో సోమవారం బీసీ ఆక్రోశ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 42% బీసీ రిజర్వేషన్ల సాధన కోసం అన్ని వర్గాల బీసీలు ఐక్యంగా రావాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన 78 ఏళ్లైనా బీసీలకు రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో సరిపడ ప్రాతినిధ్యం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. "మా వాటా మాకు కావాలి – మా అధికారం మాకు కావాలి" అనే నినాదంతో ప్రతి బీసీ మేల్కొని హక్కుల సాధన కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శీలపాక నాగరాజు, పుల్ల మల్లయ్య, గోల్కొండ సతీష్, ఉయ్యాల రమేష్, కానుగుల కొమురయ్య, జన్నె యుగేందర్, గోల్కొండ సురేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.



# బాధితుడికి మొబైల్ ఫోన్ అప్పగింత

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మండలంలోని మెట్టుపల్లి గ్రామానికి చెందిన యార రవికుమార్ సంబంధించిన మొబైల్ ను రెండు నెలల క్రితం పోగొట్టుకున్నాడు బాధితుడు ఫిర్యాదు మేరకు ఎస్సై బి అశోక్ ఆదేశాలతో సీఈఐఆర్ పోర్టల్ ఆపరేటర్ జ్యోతి ఫోన్ యొక్క ఐఎంఈఐ నెంబర్ సహాయంతో ట్రేస్ చేసి సోమవారం బాధితునికి మొబైల్ ఫోను ను ఎస్సై చేతుల మీదుగా అందించారు పోయిన మొబైల్ ఫోన్ తిరిగి అందించినందుకు యారా రవికుమార్ మొగళ్లపల్లి ఎస్ఐకి కృతజ్ఞతలు తెలిపారు




# మొగుళ్ళపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడికి పితృవియోగం

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్ళపల్లి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఆంధ్రజ్యోతి పాత్రికేయుడు కేతరాజు రమేష్ తండ్రి సమ్మయ్య సోమవారం చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సందర్భంగా కేతరాజు రమేష్ ను మొగుళ్ళపల్లి పీఏసీఎస్ చైర్మన్ నర్సింగారావు కాంగ్రెస్ నాయకులు తక్కలపల్లి రాజు, మొగుళ్ళపల్లి తాజా మాజీ సర్పంచ్ మోటే ధర్మారావు టౌన్ అధ్యక్షుడు కేతరాజు రమేష్, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి తదితరులు పరామర్శించారు,

# సిపిఐ వందేళ్ల ఉత్సవాల బస్సు జాతను జయప్రదం చేయండి

**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి**

అక్షర దర్బార్ శాయంపేట : భారత గడ్డపై సిపిఐది వందేళ్ళ చరిత్ర అని, వందేళ్ళ ఉత్సవాల సందర్భంగా ఈనెల 18, 19 తేదీల్లో హనుమకొండ జిల్లాలో జరిగే రాష్ట్ర బస్సు జాతను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి పిలుపునిచ్చారు.సోమవారం శాయంపేట మండల కేంద్రంలోని సిపిఐ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం ఎండి అంకుషావలీ అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి హాజరై మాట్లాడుతూ భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించి పోరాడిన చరిత్ర సిపిఐది అని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం నడిపి రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదని, దున్నేవానికే భూమి నినాదంతో దొరల గడిలను బద్దలు కొట్టి, పేదవాడికి భూములు పంచిన చరిత్ర సిపిఐ దన్నారు. అధికారం లేకున్నా పేద ప్రజల పక్షాన నిలబడి వారి కోసం, వారి హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తున్నదని కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. డిసెంబర్ 26న ఖమ్మం వేదికగా జరిగే సిపిఐ శత వసంతాల ఉత్సవాల ముగింపు సభ ఓ చారిత్రాత్మక ఘట్టంగా మిగిలిపోతుందని, సిపిఐ వందేళ్ళ ముగింపు ఉత్సవాల సందర్భంగా ఈనెల 18, 19 తేదీల్లో హనుమకొండ జిల్లాలో రాష్ట్ర బస్సు జాత జరుగునని తెలిపారు. బస్సు జాతలో పార్టీ, ప్రజా సంఘాల శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ పార్టీ మండల కార్యదర్శి బత్తిని సదానందం, మండల సహాయ కార్యదర్శి అనుకారి అశోక్, నాయకులు వొల్లాల రమేష్, ముంద్రాతి రమేష్, బందారి సాంబయ్య, బోగి రామదేవి, తీగల కల్పన పాల్గొన్నారు.





# కోటగుళ్లకు 'కార్తీక' శోభ

- గణపేశ్వరునికి నందీశ్వరునికి రుద్రాభిషేకం
- స్వామివారికి, భవాని మాతకు పట్టు వస్త్రాలు సమర్పించిన సీఐ దంపతులు

అక్షరదర్బార్, గణపురం: ప్రసిద్దిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళా క్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లకు కార్తిక సోమవారం శోభ సంతరించుకుంది. సోమవార పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం గణపతి పూజతో ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. కార్తీక మాసం సందర్భంగా భూపాలపల్లి సర్కిల్ ఇన్ స్పెక్టర్ దొమ్మాటి నరేష్ కుమార్ గౌడ్, లక్ష్మి దంపతులు గణపేశ్వరునికి నందీశ్వరునికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి భవాని మాతకు పట్టు వస్త్రాలు చీరే సారె సమర్పించారు. స్వామివారిని కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు.



**- దేవాదాయ శాఖ ఆర్ఐ పూజలు**

శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో కార్తీక సోమవారం దేవాదాయ శాఖ రెవెన్యూ ఇన్ స్పెక్టర్ నందనం కవిత కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు సాదరంగా ఆహ్వానించారు. అనంతరం స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



# దత్త క్షేత్రంలో కార్తీక వన భోజనాలు

అక్షరదర్బార్, హనుమకొండ: శివ కేశవులకు ప్రీతికరమైన కార్తీక మాసాన్ని పురస్కరించుకొని నగరంలోని ములుగు రోడ్డులో గల ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం అయిన శ్రీ గణపతి సచ్చిదానంద వరద దత్త క్షేత్రంలో సోమవారం కార్తీకమాసం వనభోజనాలు కార్యక్రమం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఉసిరి, మేడి, తులసి, రావి చెట్టు, గురు పాదుకల వద్ద దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. సామూహికంగా శ్రీ లలితా సహస్ర నామ స్తోత్ర పారాయణం, దివ్య నామ సంకీర్తన భజనలు చేసారు. ఆశ్రమంలో రుద్ర అభిషేకం చేసారు. మహా మంగళ హారతులు నిర్వహించిన అనంతరం అందరూ ఉసిరి చెట్టు కింద భోజనాలు చేసారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు జూలూరి శ్రీనివాస్ రావు, వడిచర్ల శ్రీనివాస్, అర్చకులు రాపాక గోపికృష్ణ శర్మ, మాతృ మండలి సభ్యులు మాజీ కార్పొరేటర్ బయ్యా స్వామి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# ఐదుగురు నకిలీ వైద్యుల అరెస్ట్

- వారి క్లినిక్ ల్లో టీజీఎంసీ దాడులు
- పలు సెక్షన్లపై కేసులు నమోదు

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రైసిటీల పరిధిలో కొంతకాలం నుంచి వరుసగా నకిలీ వైద్యులు పట్టుబడటం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తున్నది. నకిలీ వైద్యులపై వైద్యారోగ్యశాఖ, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ (టీజీఎంసీ) అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్న ఈ అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. తాజాగా సోమవారం కాజీపేట్, ఖిలావరంగల్ ప్రాంతాల్లో దాడులు నిర్వహించి ఐదుగురు నకిలీ వైద్యులను అదుపులోకి తీసుకున్నారు. టీజీఎంసీ రిజిస్ట్రార్ లాలయ్య, చైర్మన్ మహేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం. కాజీపేట్, ఖిల్లా వరంగల్ ప్రాంతాల్లో ఐదుగురు వ్యక్తులు భవాని ఫస్ట్ ఎయిడ్ సెంటర్, ఫస్ట్ ఎయిడ్ క్లినిక్, ఎస్వీహెచ్ క్లినిక్, శ్రీసాయి తేజ ఫస్ట్ ఎయిడ్ క్లినిక్, ఫస్ట్ ఎయిడ్ సెంటర్, తిరుమల క్లినిక్ పేర్లతో ఐదుగురు వ్యక్తులు అర్హత లేకున్నా స్థానికులకు వైద్యం చేస్తున్నారు. వీరిపై నిఘా వేసిన జీఎంసీ అధికారులు వారి క్లినిక్‌ల్లో దాడులు చేశారు. నిందితులు రాగి వీర నారాయణ, గజ్జవెల్లి శ్రీనివాస్, బొజ్జం సుధాకర్, గుర్రపు రామకృష్ణ, అద్దూరి దిలీప్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు వారిపై బీఎన్ఎస్ సెక్షన్లు 318, 319తో పాటు, జాతీయ మెడికల్ కమిషన్ చట్టం ప్రకారం పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేయించారు.

# కల్తీ పదార్థాలపై కరువైన తనిఖీలు..

అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట మండలంలో కల్తీ ఆహార పదార్థాలు విస్తృత మవుతున్నా అధికారుల నుంచి తనిఖీలు లేవు. గ్రామాల్లో కొంతమంది వ్యాపారులు అనుమతి లేకుండా ప్యాకింగ్ చేసిన పదార్థాలు మార్కెట్‌లోకి వదులుతున్నారు. తయారీ స్థలం, గడువు తేదీ, ఫుడ్ లైసెన్స్ లేకుండా ప్లాస్టిక్ కవర్లలో సరఫరా జరుగుతోంది. పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నా అధికారులు మౌనం వహిస్తున్నారు. జీఎస్టీ తగ్గింపుతో పాత ధరలకే వస్తువులు అమ్ముతున్నారంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంటనే స్పందించి కల్తీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని, ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.

# వీవో రామచంద్రపై చర్యలు తీసుకోవాలి

**ప్రగతి ఎంపీఎస్ ఆధ్వర్యంలో కలెక్టర్ కు ఫిర్యాదు**



అక్షర దర్బార్ చిట్యాల : మండల కేంద్రానికి చెందిన ప్రగతి ఎం పి ఎస్ ను గత ఏడు సంవత్సరాల నుండి డిఫాల్ట్ చేసి సంఘ సభ్యులను వివో ఏ రామ్ చందర్ బంద బూతులు తిడుతూ అవమానకరంగా ప్రవర్తిస్తూ మానసికంగా ఇబ్బందులు పెడుతున్నాడని అతనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు అనంతరం సోమవారం మండల కేంద్రంలో ప్రగతి ఎమ్ పి ఎస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీలత బుర్ర కోమల మాట్లాడుతూ రామచందర్ దుర్భాషలాడుతూ బూతులు తిడుతున్న దాని గూర్చి అతని భార్య మండలంలో మండల సమైక్య అకౌంటెంట్ కంప్యూటర్ ఆపరేటర్ గా చేస్తున్న అక్రమాలు దౌర్జన్యం, వేధింపుల నుండి రక్షణ కల్పించాలని జిల్లా కలెక్టర్ , అడిషనల్ కలెక్టర్ ,డి ఆర్ డి ఎ పి డిలకు ఫిర్యాదు చేయడం జరిగిందని వారు తెలిపారు.వీవో రాంచందర్, అతడి భార్య మండల సమైక్య అకౌంటెంట్ గా ఉంటూ మా సంఘాన్ని గత ఏడు సంవత్సరాల నుంచి డిఫాల్ట్ చేశారని వారు ఆరోపించారు సంఘంలోని సభ్యులందరినీ వారి గుప్పెట్లో పెట్టుకొని బెదిరింపులు వేధింపులకు పాల్పడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నా ఇన్ని సంవత్సరాలుగా భరించాము. చందర్ అతని భార్య అకౌంటెంట్ ఆపరేటర్ అయినా సరస్వతి ఆగడాలు దౌర్జన్యం నుండి మా మహిళా సంఘాలను కాపాడాలని వారు అధికారులను కోరారు. కార్యక్రమంలో సాయి నిఖిత ,ఎం రాధిక , పి శిరీష ,కే రమాదేవి , పి అనూష ,పిట్టల అనుష ,గంగాధరి రజిత మార్క మానస తదితరులు పాల్గొన్నారు.



# అందెశ్రీకి నివాళులు

అక్షరదర్బార్, హనుమకొండ: తెలంగాణ ప్రజా కవి, ఉద్యమకారులు అయిన అందెశ్రీ అకాల మరణం చెందడంతో న్యూ డెమొక్రసీ పార్టీ నాయకులు హనుమకొండ కాళోజి జంక్షన్ లో ఆయనకు నివాళులర్పించారు. అందెశ్రీ విద్యాభ్యాసం ప్రారంభం నుంచి నేటి వరకు అనేక కష్టాలు ఎదుర్కొని ఒక ప్రజా ఉద్యమకారునిగా మాత్రమే కాక ప్రజా కళాకారునిగా ప్రజాకవిగా రాష్ట్ర ప్రజలను ఉత్తేజపరిచిన ఘనత ఆయనకు దక్కుతుందని, తెలంగాణ ఉద్యమంలో తన పాత్ర మరువలేనిదని, ఆయనకు మరోసారి నివాళులర్పిస్తూ వారి కుటుంబానికి సానుభూతి తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు, ఐఎఫ్ టియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగుల దయాకర్, ఎలకంటి రాజేందర్, పీడీఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, మహమ్మద్ ఖాన్, కమలాకర్ పాల్గొన్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

**మీ నమ్మకమే మా బలం!**

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915